# ఉరుములు

ఉరుములు ఉదయం దేవస్థానాలలో దేవతలను మేల్కొలుపుటకు ఉపయోగించేటి వాద్యం. అందువలన ఈ వాద్యంవాయించెడి వారిని దేవతా ఉరుములు అందురు. వీరు అనంతపురం జిల్లాలోను మరియు అనంతపురం జిల్లా సరిహద్దులలోగల కర్నాటక రాష్ట్రంలోని జిల్లాలలోను ఉన్నారు. మన రాష్ట్రంలో యిప్పటికీ అనంతపురం జిల్లాలో దేవస్థానంలలో ప్రతి ఉదయం మరియు దేవతా ఉత్సవాలు, దేవతలకు ఆవాహనం చేయునప్పుడు ఈ వాద్యాలను ఉపయోగించెదరు. ఈ వాద్యాలు వాయిస్తూ పద్యాలు, శ్లోకాలు కూడా చదువుతుంటారు. ఈ వాద్యం మృదంగంకన్నా పెద్దదిగా ఉండును. రెండు ఇత్తడి చట్రాలలో మేకచర్మం గట్టిగా బిగించబడి ఉండుటవల్ల వాయించునప్పుడు ఉరుముతోపోలిన పెద్ద శబ్దం వచ్చును. ఈ కళాకారులు మాలకులంలోని ఒక తెగకుచెందినవారు. వీరి జీవనవిధానంలో చాలానియమనిబంధనలు పాటిస్తారు. మద్యం, మాంసం తీసుకోరు. ఇప్పటికీ కాళ్లకు చెప్పలు వేసుకోరు. శుక్రవారం, సోమవారం ఒంటిపూట భోజనం చేయటం, చావింటికి, పురిటింటికి వెళ్లకపోవడం వంటి నిబంధనలను ఇప్పటికీ తూచాతప్పకుండా పాటిస్తున్నారు. ఉదయం లేవగానే ఉరుమువాయిద్యమును పూజించిగానీ వేరొకపని చేపట్టరు. వారు ఉరుము వాద్యాన్ని అంకమ్మదేవత అవతారముగా భావించెదరు. ఉరుము వాయించేటప్పుడు ఓంకారనాదంవస్తుంది. ఆ ఓంకారనాదం దేవతలను ఆవాహనచేయుటకు, ఉత్తేజ పరచుటకు దోహదపడుననివారి నమ్మకం. ఈ వాద్యన్ని గుళ్లలోను, దేవతా ఉత్సవాలలోనేకాక, మృగాలను ఈ వాద్యం యొక్క శబ్దంతో భయపెట్టి దూరప్రాంతాలుతరుముటకు ఉపయోగించెదరు. వీరు నాగదేవతల కథలు ఈ వాద్యంతో ఆలపిస్తారు. వీరు అంకమ్మ, పోతురాజు, కాటమయ్య మొదలయిన శక్తి దేవుళ్లు, దేవతలను స్తోత్రంచేస్తూ ఉరుము వాద్యంతో పాడుతారు.

ఈ విద్య ముఖత: ఒకరినుండి ఇంకొకరికి వంశపారంపర్యంగా చెప్పబడిన విద్యేకానీ గ్రంథస్థంకాబడలేదు. ఈ విద్యను 1982లో సాంస్కృతిక శాఖ వారు ఏర్పాటుచేసిన ప్రదర్శనలో శ్రీ ఉరుముల ఓబులేసుచే ప్రదర్శించబడుటవల్ల ప్రచారం లభించింది. తర్వాత రామాంజనేయులు, సిద్ధరామాపురం గ్రామం, అనంతపురం జిల్లావారిచే ప్రజలలో వ్యాప్తిచెందింది. దేవస్థానాలలో ఉరుములు వాయించినందుకు ఈనాములు ఇవ్వబడినవి. ఆ భూములను సేద్యంచేసుకొనుచూ వీరు జీవితముగడుపుచున్నారు. అనంతపురం జిల్లాలో సుమారు 150 కుటుంబాలు ఇప్పటికీ ఈ వృత్తిపై ఆధారపడి జీవించుచున్నారు. యువతరంవారు నియమ నిబంధనలు పాటించలేక ఈ కళను అభ్యసించుటకు కొంతవెనుకాడుచున్నారు.